# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

బుధవారం | 28 ఆగస్టు 2024 | పేజీలు 8





పార్కుస్థలం హెచ్చరిక బోర్డును పక్కనపెట్టి ప్రీకాస్ట్ ప్రహరీగోడ..

# పార్కుస్థలాలకు... రిజిస్ట్రేషన్‌లు

**దుండిగల్ మున్సిపల్ బౌరంపేట్ సింహపురి కాలనీలో ఈ తతంగం..**

**సంక్షేమ సంఘాల కనుసన్నల్లోనే అంటూ ఆరోపిస్తున్న స్థానికులు..**

బౌరంపేట్ సింహపురి కాలనీ పార్కుస్థలాల వివరాలతో బోర్డు..





- దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట్ సింహపురి కాలనీలో పార్కుస్థలం విక్రయించి రిజిస్ట్రేషన్..
- కమిషనర్‌కి ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదన్న ఫిర్యాదు దారులు..
- "ఏ-122 అపార్ట్‌మెంట్ పక్కనే పార్కుస్థలంగా గ్రామ పంచాయతీ హయాంలోనే హెచ్చరిక బోర్డు..
- సింహపురి కాలనీ సర్వే నెంబర్ 442, 443 "ఏ బ్లాక్‌లో" పార్కుస్థలం 111.80 గజాలు విక్రయం..
- డి-బ్లాక్‌లో ప్లాట్ నెం.333, 334 పక్కనే మరో 450 గజాలు విక్రయించినట్లు స్థానికుల సమాచారం..
- డి-బ్లాక్‌లోనే టెంపుల్ కాంప్లెక్స్ పేరుతో మరో పార్కుస్థలం కబ్జాకు సిద్ధం అంటున్న స్థానికులు..

-2లో

మాధవ్ పత్తి..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 27:


ఓవైపు "హైడ్రా" చర్యలతో హైదరాబాద్ మహానగరం వణికి పోతుంటే..! మరికొందరు కబ్జాదారులకు భయం లేకుండా పోతోంది.. లేఅవుట్‌లోని పార్కుస్థలాలు బహిరంగంగా విక్రయిస్తున్నారు.. 1996లో సుమారు 100 ఎకరాల పైచిలుకు లేఅవుట్‌లో 6 బ్లాక్‌లతో నిర్వాహకులు వెంచర్ పూర్తిచేశారు.. అనంతరం 2006లో అసోసియేషన్ ఫామ్ చేసినట్లు కాలనీ ప్రజలు చెబుతున్నదే.. 6 బ్లాక్‌లకు ఎక్కడికక్కడ పార్కుస్థలాలు కేటాయించారు.. కాలక్రమేణా పెరుగుతున్న రియల్ భూమ్‌తో కబ్జాకు కాదేది అనర్హం అన్న చందంగా..! సదరు లేఅవుట్‌లోని పార్కుస్థలాలపై కొందరు అసోసియేషన్ పెద్దల కన్నుపడి తాజాగా విక్రయాలు జరుపుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు.. ఈనెల 24న దుండిగల్ కమిషనర్ కె.సత్యనారాయణకి కాలనీ వాసులు ఫిర్యాదు చేసి వినతిపత్రం అందజేశారు.. నాలుగు రోజులైనా చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు..



సింహపురి కాలనీ 'ఏ-బ్లాక్' మీదుగా తీసిన ఏరియల్ వ్యూ..

## మేనేజ్‌మెంట్ కోటా సీట్ల వివరాలివ్వండి

### ఉన్నత విద్యామండలి ఆదేశం



హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్ కాలేజీల్లో మేనేజ్ మెంట్ కోటాలో భర్తీ చేసే సీట్ల వివరాలు సమర్పించాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి ప్రైవేట్ కాలేజీలకు ఆదేశాల జారీ చేసింది. సెప్టెంబర్ 5 తేదీ లోపు ఉన్నత విద్యామండలి వెబ్ సైట్ లో మేనేజ్ మెంట్ కోటా సీట్లకు సంబంధించిన వివరాలను ప్రైవేట్ కాలేజీ నమోదు చేయాలని మంగళవారం (ఆగస్టు 27) ఆదేశాలు జారీ చేసింది. లేట్ ఫీజు 1000 రూపాయులతో సెప్టెంబర్ 10వ తేదీ వరకు అన్ లైన్ లో వివరాలు నమోదు చేయాలని ఉన్నత విద్యామండలి ఆదేశించింది.

## జన్వాడ ఫాంహౌస్ కొలతలు తీస్తున్న హైడ్రా అధికారులు

హైదరాబాద్ పెన్ పవర్:రంగారెడ్డి జిల్లాలోని జన్వాడ ఫాంహౌస్ పై సర్కార్ యాక్షన్ షురూ అయింది. ఫాంహౌస్ ను పరిశీలించారు ఇరిగేషన్ అధికారులు. ఫాంహౌస్ ను కొలుస్తున్నారు అధికారులు, సిబ్బంది.

ఇప్పటికే జన్వాడ ఫాంహౌస్ ను కూల్చొద్దంటూ హైకోర్టుకు వెళ్లారు బీఆర్ఎస్ నేత, కేటీఆర్ సన్నిహితుడు ప్రదీప్ రెడ్డి. ఐతే సిటీలో చెరువుల కబ్జా, ప్రభుత్వ

-3 లో



# పార్కుస్థలాలకు.. రిజిస్ట్రేషన్‌లు..



ఏ-బ్లాక్‌లో గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసిన పార్కు స్థలం ఇదే..

డి-బ్లాక్‌లో మరొక చోట బోర్డు తొలగించి చదును చేసిన స్థలం కబ్జాకు సిద్ధం..









తొలగించిన పార్కుస్థలం బోర్డు ఇదే..

డి-బ్లాక్‌లో పార్కుస్థలంగా ఏర్పాటు చేసిన పాత బోర్డు..




**బౌరంపేట్**
**సింహపురి కాలనీ 6 బ్లాక్‌ల పార్కుస్థలాల వివరాలు (బోర్డుపై ఉన్నది ఉన్నట్లు) కాలనీలో మొత్తం 6 బ్లాకులకు గాను.. ఏ-బ్లాక్‌లో 2 పార్కులకు 2628 గజాలు కేటాయించగా.. బి-బ్లాక్‌లో '0' ఏమి లేనట్టు చూపించారు.. సి-బ్లాక్‌లో 1 పార్కు స్థలానికి 513 గజాలు.. డి-బ్లాక్‌లో 4 పార్కు స్థలాలకు గాను 5334 గజాలు కేటాయించారు.. ఇ-బ్లాక్‌లో 2 పార్కులకు 5040 గజాలు కేటాయించారు.. ఎఫ్-బ్లాక్‌లో 1 పార్కు స్థలానికి 2208 గజాల స్థలం కేటాయిస్తూ..! మొత్తం 10 పార్కుల జాబితాను బోర్డుపై ఉంచారు.. అయితే మరికొన్ని పార్కు స్థలాలు కూడా ఆక్రమణకు గురైనట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.. వాటిపైన అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు..**




ప్రీకాస్ట్ ప్రహరీగోడ నిర్మాణానికి గత 22న ఇలా పనులు..

## సింహపురి కాలనీ "డి-బ్లాక్‌లోనూ"..

బౌరంపేట్ సింహపురి కాలనీ 6 బ్లాకులుగా వెంచర్ ఏర్పాటు చేశారు.. అయితే ప్రతి బ్లాకులో కేటాయించిన పార్కు స్థలాల్లో ఎన్ని పార్కులు, ఎన్ని గజాలు అన్న వివరాలను బోర్డుపై ఉంచారు.. "డి-బ్లాక్‌లో" 4 పార్కులకు గాను, 5334 గజాల స్థలం కేటాయించినట్లు స్పష్టంగా ఉంది.. డి-బ్లాక్‌లో ప్లాట్ నెంబర్ 333, 334 పక్కనే ఉన్న సుమారు 450 గజాల స్థలంలో ఉన్న పార్కుస్థలం బోర్డును తొలగించి చదును చేశారు.. స్థానికులు పార్కుస్థలాల కబ్జాలను మీడియా దృష్టికి తీసుకువచ్చారు.. డి-బ్లాక్‌లోనేహామరోచోట ఉన్న పార్కుతొలగించి "శ్రీ గణపతి పార్కుగా" బోర్డు ఏర్పాటు చేయగా..! అదే స్థలంలో పాత బోర్డును తొలగించి కొత్తగా "శ్రీ గణపతి టెంపుల్ కాంప్లెక్స్"గా నూతన బోర్డు ఏర్పాటు చేయడంపై డి-బ్లాక్ ప్రజలు వ్యతిరేకిస్తున్నారు.. సదరు పార్కుస్థలాన్ని అభివృద్ధి చేయకుండా టెంపుల్ కాంప్లెక్స్ పేరుతో కమర్షియల్ చేసేందుకు చూస్తున్నారని ఆరోపించారు..




కొత్తగా మరోబోర్డును ఏర్పాటు చేస్తూ టెంపుల్ కాంప్లెక్స్‌గా బోర్డు..

- మొదటి పేజి తరువాయి

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, దుండిగల్ మున్సిపల్ పరిధి బౌరంపేట్ సింహపురి కాలనీలోని పార్కుస్థలాలు విక్రయిస్తున్నారని, ఈనెల 24న దుండిగల్ మున్సిపల్ కమిషనర్ కె.సత్యనారాయణకి వినతిపత్రం అందజేశారు.. బౌరంపేట్ సింహపురి కాలనీలోని ఏ-బ్లాక్‌లో 122వ ప్లాట్ అపార్ట్‌మెంట్‌కు అనుకుని ఉన్న సుమారు 700 గజాల పార్కుస్థలంలో, గ్రామపంచాయతి హయాంలోనే హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.. ఆహ్లాదకరమైన వాతావరణంలో,కాలనీ వాసులు కూర్చునేందుకు ఆర్ఎంసి చైర్‌లు ఏర్పాటు చేశారు.. హెచ్చరిక బోర్డును తొలగించి "ప్రీ కాస్ట్" వాల్ కూడా నిర్మించి యదేచ్ఛగా కబ్జా చేయడం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు..

సదరు పార్కు స్థలాన్ని కాపాడాలని అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గత 24వ తేదీన, బీజేపీ ఆధ్వర్యంలో సింహపురి కాలనీవాసులు దుండిగల్ కమిషనర్‌కి వినతిపత్రం అందజేశారు.. కమిషనర్ స్పందించి పార్కుస్థలం కబ్జాపై తక్షణమే చర్యలు చేపట్టాలని టౌన్‌ప్లానింగ్ అధికారికి ఆదేశించినట్లు కాలనీ వాసులు తెలిపారు..



24వ తేదీన పార్కుస్థలం కబ్జాలపై దుండిగల్ కమిషనర్ సత్యనారాయణకు వినతిపత్రం..

## పార్కు స్థలానికి గిఫ్ట్ రిజిస్ట్రేషన్..

బౌరంపేట్ సింహపురి కాలనీ సర్వే నెం.442, 443 ఏ-బ్లాక్‌లో 122 ప్లాట్ పక్కనే ఉన్న పార్కుస్థలంలో కొంత భాగం,111.80 గజాలు విభజించి 122/1 గా దయాకర్ రెడ్డి అనే వ్యక్తి, శ్రీరాములు అనే వ్యక్తికి గత నెలలో (2024 జులై) లో గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసినట్లు స్థానికులు డాక్యుమెంట్ చూపించారు.. వెంచర్ నిర్వాహకులు, ఒక్కో బ్లాక్‌లో ఎంత విస్తీర్ణంలో పార్కుస్థలాలు ఉన్నాయో 6 బ్లాకుల్లోని పార్కుస్థలాల వివరాలను బోర్డుపై స్పష్టంగా తెలియజేశారు.. సింహపురి కాలనీ మొత్తం అపార్ట్‌మెంట్‌లతో ఉన్నందున, కాసేపు ఆహ్లాదకరమైన వాతావరణంలో గడపడానికి కేటాయించిన పార్కుస్థలాలు కబ్జాకు గురైతే..! భవిష్యత్తులో పరిస్థితి ఏమిటని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.. తాము పార్కు స్థలాలను చూసిన తర్వాతే అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొనుగోలు చేశామని,ఇప్పుడు పార్కుస్థలాలు విక్రయించడం ఏంటని కాలనీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు..

# అన్నారం, సుందిళ్ల లొకేషన్లు మార్చాం

ప్రతిపాదిత స్థలంలోనే మేడిగడ్డ నిర్మాణం

కాళేశ్వరం కమిషన్ విచారణలో ఇంజినీర్లు

ఐదుగురు ఇంజినీర్లను ప్రశ్నించిన కమిషన్

రిటైర్డ్ జస్టిస్ నే ఎదురు ప్రశ్నించిన ఆఫీసర్లు


వాళ్ల సమాధానాలపై కమిషన్ సీరియస్



**హైదరాబాద్ పెన్ పవర్:**కాళేశ్వరం కమిషన్ విచారణ ఊపందుకుంది. ఇవాళ నిర్వహించిన ఓపెన్ కోర్టులో ఐదుగురు ఇంజినీర్లను కమిషన్ ప్రశ్నించింది. బ్యారేజీల డిజైన్లు అప్రూవల్ పొందిన తర్వాత మార్పులు, చేర్పులు ఏమైనా జరిగాయా.? డిజైన్ అప్రూవల్ చేసే ముందు, తర్వాత నిబంధనలు పాటించారా అని కమిషన్ అడిగింది. హైపవర్ కమిటీ నిబంధనలు క్రైటేరియా ఫాలో అయ్యారా..? లేదా..? అని ఇంజినీర్లను కమిషన్ ప్రశ్నించింది. దీనిపై ఇంజినీర్లు స్పందిస్తూ.. అన్నారం, సుందిళ్ల లొకేషన్లు మార్చామని స్పష్టం చేశారు. మేడిగడ్డ బ్యారేజీ ప్రతిపాదిత స్థలంలో నిర్మాణం జరిగిందని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా కమిషన్ అడిగే ప్రశ్నలకు పలువురు ఇంజినీర్లు కౌంటర్ క్వశ్చన్స్ వేశారు. దీనిపై కమిషన్ సీరియస్ అయ్యింది. కమిషన్ అడిగిన పలు ప్రశ్నలకు మాజీ సీడీవో, ఇంజినీర్లు పొంతన లేని సమాధానాలు ఇవ్వడం గమనార్హం. మూడు బ్యారేజీలకు సంబంధించి డిజైన్లలో ఎలాంటి సమస్యా లేని, అంతా నిబంధనల ప్రకారమే ఉందని కమిషన్ కు ఇంజినీర్లు తెలిపారు. మధ్యాహ్నం వరకు ఇద్దరు ఇంజినీర్లను విచారించిన కమిషన్ ఆ తర్వాత మరో ముగ్గురు ఇంజినీర్లను ప్రశ్నించింది. ఇదిలా ఉండగా గతంలో కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరైన జలవనరుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వీ ప్రకాశ్ ఇవాళ కమిషన్ కు తన అఫిడవిట్ ను అందజేశారు.

# సెప్టెంబర్ 1 నుంచి హైదరాబాద్‌లో ఆర్ట్ ఎగ్జిబిషన్




**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ నగరం మరో ప్రత్యేకమైన ఆర్ట్ ఎగ్జిబిషన్ కు వేదిక కానుంది. సెప్టెంబర్ 1న ఉదయం 11 గంటలకు మాదాపూర్ కావూరి హిల్స్ లోని స్టేట్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్ లో ఈ ఎగ్జిబిషన్ జరగనుంది. ఢిల్లీ ఆర్ట్ మాగ్నమ్ ఆధ్వర్యంలో ప్రముఖ ఆర్ట్ క్యూరియేటర్ అన్నపూర్ణ ఈ ఆర్ట్ ఎగ్జిబిషన్ ను నిర్వహించనున్నారు. ఈ ఆర్ట్ ఎగ్జిబిషన్ లో నలుగురు విభిన్న కళాకారులు ధ్రువ్ పటేల్, దుష్యంత్, రఘు, ముఖ్తార్ అహ్మద్‌లు తమ ప్రత్యేకమైన కళాఖండాలను ప్రదర్శించనున్నారు.

చిత్రకళా రంగంలో సరికొత్త కోణాన్ని కళా ప్రేమికుల ముందుకు తీసుకువస్తున్నారు. యాంత్రిక జీవనంలో జీవితాన్ని ఎలా ఆనందంగా అనుభవించాలో ప్రత్యేకంగా తమ కళాఖండాలను ప్రదర్శించనున్నారు. ప్రస్తుత ఉరుకుల, పరుగుల జీవితంలో ఒక నిమిషం ఆగి ఆ క్షణాన్ని ఆస్వాదించడమే మరిచిపోతున్న సందర్భంలో ఈ నలుగురు కళాకారుల విభిన్న ప్రదర్శన ప్రజల సరికొత్త ప్రయాణానికి నాంది పలుకుతుంది అనడంలో అతిశయోక్తి లేదు.

ఆర్టిస్ట్ రఘు తనదైన శైలితో మనకు కొత్త లోకాన్ని పరిచయం చేస్తారు. అందమైన జీవితాన్ని, ఒకరకమైన స్వచ్ఛతను చూపరులకు కళ్లకు కట్టినట్లు చూపిస్తారు. అలాగే ఆర్టిస్ట్ ముఖ్తార్ అహ్మద్ వర్షం, ధూళి కారణంగా పాడుపడ్డ భవనాల ద్వారా తన కథలు తెలియజేస్తారు. ధృవ్ పటేల్ కళ కూడా చాలా ప్రత్యేకమైనది. లంగూర్లు మానవ లక్షణాలను ప్రతిబింబిస్తాయి. వాటిని చూడగానే అందరి ముఖాల్లో చిరునవ్వు కనిపిస్తుంది.

అలాగే ఆర్టిస్ట్ దుష్యంత్ ఆర్ట్ లో ఎప్పుడూ మనకు తెలిసిన వస్తువులే కనిపిస్తాయి. వాటిని పిల్లల ఆటల్లో ఉన్నట్లు జంతువులతో జత చేస్తారు. అతని వాటర్ కలర్స్ వీక్షకులను బాగా ఆకర్షిస్తాయి. ఈ ఆర్టిస్టులు అంతా కలిసి మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని కొత్తగా పరిచయం చేస్తారు. ఈ ప్రదర్శన కేవలం కళ ప్రదర్శన మాత్రమే కాదు, అందరినీ ఒక అడుగు వెనక్కి తీసుకుని, జీవితంలో సాధారణ ఆనందాలను ఆస్వాదించేలా ప్రేరేపిస్తుంది.

ప్రారంభోత్సవ వివరాలు :

## జన్వాడ ఫాంహౌస్ కొలతలు తీస్తున్న హైడ్రా అధికారులు

- మొదటి పేజి తరువాయి

భూముల ఆక్రమణలపై రూల్స్ ప్రకారమే వెళ్లాలని ప్రభుత్వానికి సూచించింది హైకోర్టు.రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం జన్వాడ గ్రామం సర్వే నంబర్ 311 (311/7)లో 1,210 చదరపు గజాల్లోని 3,894 చదరపు అడుగులతో నిర్మించిన ఫామ్‌హౌస్ ఎఫ్ టీఎల్, బఫర్ జోన్ లో నిర్మించారని గత కొన్ని రోజులుగా ఆరోపణలు వస్తున్నాయి. అయితే ఈ ఫామ్ హౌస్ తనది కాదన్నారు. తన ఫ్రెండ్ ఫామ్ హౌజ్ ను లీజుకు తీసుకున్నానని చెప్పారు.

## కవిత విడుదల కోసం... జైలు ఎదుట బీఆర్ఎస్ నాయకుల ఎదురుచూపు

తీహార్ జైలు వద్దకు వచ్చిన బీఆర్ఎస్ నాయకులు

రాత్రి ఎనిమిది గంటల తర్వాత కవిత విడుదలయ్యే అవకాశం

జైలు బయట శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్ తదితర నేతలు



**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టులో బెయిల్ వచ్చిన నేపథ్యంలో ఆమె తీహార్ జైలు నుంచి విడుదల కానున్నారు. కవిత విడుదల ప్రక్రియ కొనసాగుతోంది. రాత్రి 8 గంటల తర్వాత విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆమె విడుదల అవుతుందనే ఉద్దేశంతో బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున తీహార్ జైలు వద్దకు చేరుకున్నారు. వారు కవిత విడుదల కోసం వేచి చూస్తున్నారు. శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్ తదితర నేతలు జైలు వద్ద వేచి చూస్తున్నారు.జైలు నుంచి విడుదలైనప్పటికీ కవిత ఈరోజు రాత్రికి ఢిల్లీలో బస చేస్తారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆమె ఉండనున్నారు. రేపు ట్రయల్ కోర్టు విచారణ అనంతరం ఢిల్లీ నుంచి బయలుదేరుతారు. కవిత వెంట ఆమె భర్త అనిల్ కుమార్, కేటీఆర్, హరీశ్ రావు హైదరాబాద్ రానున్నారు. అక్కడి నుంచి ఫామ్ హౌస్ చేరుకుంటారు.

## గన్ మన్ తల్లి మృతదేహానికి ఎమ్మెల్యే వివేక్ నివాళులు



**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి గన్ మన్, హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరుకు చెందిన ముష్క రవి తల్లి లచ్చమ్మ అనారోగ్యంతో నిన్న రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఇవాళ లచ్చమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. లచ్చమ్మ కుమారులైన రవి, రజనీకాంత్ లను ఓదార్చారు. అనంతరం లచ్చమ్మ అంత్యక్రియల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్టెంపెల్లి ఐలయ్య, మాజీ ఎంపీపీ అశోక్ ముఖర్జీ, మాజీ ఎంపీటీసీ బొల్లంపల్లి రమేష్ తదితరులున్నారు.

## లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్



**హైదరాబాద్ పెన్ పవర్:**ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని డిమాండ్ చేస్తూ తుడుం దెబ్బ, ఏజేన్సీ సంఘాలు ఆందోళనకు దిగాయి. ఆదిలాబాద్ జిల్లా బంద్ కు పిలుపునిచ్చాయి. ఆదిలాబాద్ ఆర్టీసీ బస్ డిపో ఎదుట బైఠాయించారు. బస్సులు బయటకు రాకుండా అడ్డుకోవడంతో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ఇక బంద్ నేపథ్యంలో దుకాణాలు తెరచుకోలేదు. సందర్భంగా ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ గోడం గణేశ్ మాట్లాడుతూ.. జీవో 3ను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. వలస లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి లంబాడీ సామాజికవర్గాన్ని తొలగించి తమకు న్యాయం చేయాలన్నారు. ఇతర రాష్ట్రాలలో బీసీ, ఎస్సీగా ఉన్న ఆ సామాజికవర్గం, రాష్ట్రంలో ఎస్టీ జాబితాలో కొనసాగుతుండటం వల్ల ఆదివాసీలు బెనిఫిట్స్కీమ్ లు అందడం లేదన్నారు.

## తెలంగాణ నుంచి రాజ్యసభ సభ్యుడిగా అభిషేక్ మను సింఘ్వీ ఏకగ్రీవం

ముగిసిన నామినేషన్ ఉపసంహరణ ప్రక్రియ

ఇండిపెండెంట్ పద్మరాజన్ నామినేషన్ తిరస్కరణ

దీంతో ఏకగ్రీవమైన అభిషేక్ మను సింఘ్వీ



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాజ్యసభ సభ్యుడిగా అభిషేక్ మను సింఘ్వీ ఎన్నిక ఏకగ్రీవమైంది. రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్ ఉపసంహరణకు ఈరోజుతో గడువు ముగిసింది. రాజ్యసభ అభ్యర్థిత్వానికి కాంగ్రెస్ నుంచి సింఘ్వీ, ఇండిపెండెంట్గా పద్మరాజన్ నామినేషన్ దాఖలు చేశారు.ఎమ్మెల్యేలు ఎవరూ బలపరచకపోవడంతో పద్మరాజన్ నామినేషన్ను తిరస్కరించారు. దీంతో సింఘ్వీ ఏకగ్రీవమయ్యారు. సింఘ్వీ తరపున కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఎన్నికల అధికారి నుంచి ధృవీకరణ పత్రం తీసుకుంటారని తెలుస్తోంది.

సింఘ్వీ గతంలో రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారు. 2006, 2018లో ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. ఈ ఏడాది మార్చిలో హిమాచల్ ప్రదేశ్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా పోటీ చేసి ఓడిపోయారు. బీజేపీ అభ్యర్థి చేతిలో ఆయన ఓటమి చవిచూశారు. ఇప్పుడు కేకే రాజీనామాతో ఖాళీ అయిన స్థానంలో సింఘ్వీ ఏకగ్రీవమయ్యారు.

# కవితకు బెయిల్.. పార్టీల మధ్య పంచాది



**హైదరాబాద్ పెన్ పవర్:**ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కవితకు బెయిల్ రావడంపై బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కయిందని కాంగ్రెస్ నేతలు..బీఆర్ఎస్ , కాంగ్రెస్ కుమ్మక్కయ్యిందని బీజేపీ నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు.లిక్కర్ స్కాంలో కవిత బెయిల్ పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన ట్వీట్ పై ఫైర్ అయ్యారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. కేంద్ర మంత్రి పదవిలో ఉండి ఇష్టమొచ్చినట్టు కామెంట్లు చేయడం తగదన్నారు. సంజయ్ వ్యాఖ్యలను కోర్టు ధిక్కారంగా భావించి చర్యలు తీసుకోవాలని %ఆ% వేదికగా సుప్రీంకోర్టును కోరారు కేటీఆర్.

బండి సంజయ్ ఏమన్నారంటే.. లిక్కర్ స్కాం కేసులో కవితకు బెయిల్ ఇప్పించినందుకు కాంగ్రెస్ పార్టీ న్యాయవాదులకు అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ అలుపెరుగని ప్రయత్నాలకు ఫలితం లభించిందని సెటైర్లు వేశారు. కవిత బెయిల్.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల విజయమన్నారు. కవిత బెయిల్ పై బయటకొస్తే.. కాంగ్రెస్ వ్యక్తి రాజ్యసభకువెళ్లారని చెప్పారు. కవిత బెయిల్ కోసం వాదించిన అభ్యర్థిని కాంగ్రెస్ ఏకగ్రీవం చేసి రాజ్యసభకు పంపిందన్నారు. కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడికి మద్దతివ్వడంతో కేసీఆర్ అద్భుతమైన రాజకీయ చతురత ప్రదర్శన అని అన్నారు బండి సంజయ్.

మరో వైపు లిక్కర్ స్కాం కేసులో కవితకు బెయిల్ ఊహించిందేనన్నారు టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కుతోనే కవితకు బెయిల్ వచ్చిందన్నారు. హరీశ్ రావు, కేటీఆర్ ఢిల్లీలో బీజేపీ నేతల ఇళ్ల చుట్టూ తిరిగి వాళ్ల కాళ్ళ మీద పడి కవితకు బెయిల్ తెచ్చుకున్నారని విమర్శించారు.

# కవితకు బెయిల్పై వ్యాఖ్య... బండి సంజయ్పై వినోద్ కుమార్ ఆగ్రహం

బండి సంజయ్ అనాలోచితంగా వ్యాఖ్యలు చేశారన్న బీఆర్ఎస్ నేత

బండి సంజయ్ వ్యాఖ్యలను ఖండించిన వినోద్ కుమార్

మోదీకి బీఆర్ఎస్ లొంగిపోయుంటే కవితకు ఎప్పుడో బెయిల్ వచ్చి ఉండేదన్న వినోద్ కుమార్

**హైదరాబాద్ పెన్ పవర్:** కవితకు సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వడంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేత వినోద్ కుమార్ మండిపడ్డారు. ఆయన అనాలోచితంగా ఈ వ్యాఖ్యలు చేశారని, వీటిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

మంగళవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఆలస్యమైనప్పటికీ కవితకు బెయిల్ ఇవ్వడం సంతోషకరమైన విషయమన్నారు.

మద్యం పాలసీ కేసులో బీజేపీ వ్యతిరేక పార్టీలకు సంబంధించిన నేతలపై ఆరోపణలు ఉన్నాయని గుర్తు చేశారు. రాజకీయంగా బీజేపీని విభేదించే నేతలు కాకపోయి ఉంటే ఈ కేసులో 15 రోజుల్లోనే బెయిల్ వచ్చి ఉండేదన్నారు.మోదీ ప్రభుత్వం చాలామందిపై ఇలాంటి అక్రమ కేసులు పెట్టి లొంగతీసుకుంటోందని ఆరోపించారు. బీఆర్ఎస్ లొంగిపోయి ఉంటే కవితకు ఎప్పుడో బెయిల్ వచ్చి ఉండేదన్నారు.

తాము కోర్టులో కొట్లాడి... చట్టపరంగా బెయిల్ తెచ్చుకున్నామన్నారు. కేసీఆర్ను ఇబ్బంది పెట్టడానికే కవితను ఇరికించారని ఆరోపించారు.

కవిత ఎండలు మండిపోయే వేసవిలో జైలు జీవితం అనుభవించారని వాపోయారు.

మద్యం పాలసీ కేసులో ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా రికవరీ కాలేదని సుప్రీంకోర్టు కూడా చెప్పిందన్నారు. ఛార్జిషీట్ వేశాక ఇంకా జైల్లో ఎందుకు పెట్టారని సుప్రీంకోర్టు ప్రశ్నించిందన్నారు. దానికి విచారణ సంస్థ నుంచి సమాధానం రాలేదన్నారు.

# పొంతన లేని సమాధానాలు.. ఇంజనీర్లపై కాళేశ్వరం కమిషన్ సీరియస్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంజనీర్లపై జస్టిస్ పీసీ చంద్ర ఘోష్ కమిషన్ సీరియస్ అయ్యింది. పొంతనలేని సమాధానాలు చెప్పడంపై ఇంజనీర్ల తీరును తప్పుబట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ చేస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఓపెన్ కోర్టులో భాగంగా ఆగస్టు 27న విచారణకు హాజరయ్యారు ఐదుగురు తాజా, మాజీ %జణా% ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు.

విచారణలో భాగంగా అప్రూవల్ పొందిన తర్వాత బ్యారేజీల డిజైన్లలో మార్పులు చేర్పులు ఏమైనా జరిగాయా అని కమిషన్ ప్రశ్నించింది. డిజైన్లు అప్రూవల్ చేసే ముందు ఆ తర్వాత అన్ని నిబంధనలు పాటించారా అని ప్రశ్నించారు పీసీ ఘోష్. హై పవర్ కమిటీ నిబంధనలు క్రైటీరియా ఫాలో అయ్యారా లేదా అని ఇంజనీర్లను ప్రశ్నించారు. డిజైన్స్ అప్రూవల్ అయిన తర్వాత లొకేషన్ లలో ఏమైనా మార్పులు చేర్పులు చేశారని ప్రశ్నించారు.

అన్నారం సుందిళ్ల బ్యారేజీల లొకేషన్ మారినట్లు కమిషన్ కు చెప్పారు అధికారులు. మేడిగడ్డ లోకేషన్ మారలేదని కమిషన్ ముందు స్పష్టం చేశారు తాజా మాజీ ఇంజనీర్లు. సిడిఓ – ఎల్ అండ్ టి వేరువేరుగా డిజైన్లు తయారుచేసి ఫైనల్ అప్రూవల్ కు అన్ని ఒకే దగ్గర చేసినట్లు తెలిపారు. మూడు బ్యారేజీలకు సంబంధించి డిజైన్లలో ఎలాంటి సమస్య లేదని నిబంధనల ప్రకారమే డిజైన్లు ఉన్నాయని తెలిపారు ఇంజనీర్లు. అయితే కమిషన్ అడిగే ప్రశ్నలకే ఎదురు ప్రశ్నలు వేయడంతో పాటు అడిగిన ప్రశ్నలకు పొంతనలేని సమాధానాలు ఇచ్చారు %జణా% మాజీ ఇంజనీర్లు. దీంతో కమిషన్ ఇంజనీర్లపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆగస్టు 27 మధ్యాహ్నం వరకు ఇద్దరి ఇంజనీర్ల విచారణ ముగిసింది. కాసేపట్లో మరో ముగ్గురు ఇంజనీర్లను కమిషన్ విచారించనుంది.

## కవితకు బెయిల్.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల విజయం : కేంద్ర మంత్రి బండి సంజయ్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఎమ్మెల్సీ కవిత బెయిల్ పై బయటకు రావటం బీఆర్ఎర్, కాంగ్రెస్ పార్టీల విజయం అంటూ కామెంట్ చేశారు బీజేపీ కేంద్ర మంత్రి బండి సంజయ్. అలుపెరగని ప్రయత్నాలు చివరికి ఫలించాయంటూ ఎక్స్ లో పోస్ట్ చేశారాయన. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవితకు బెయిల్ రావటంపై కాంగ్రెస్ పార్టీకి.. న్యాయవాదులకు అభినందనలు చెప్పారు. బీఆర్ఎస్ నాయకులురాలు బెయిల్ పై బయటకు వచ్చారు.. కాంగ్రెస్ వ్యక్తి రాజ్యసభకు వెళ్లారు అంటూ కామెంట్ చేశారు కేంద్ర మంత్రి బండి సంజయ్. కవిత బెయిల్ కోసం వాదించిన లాయర్ ను.. కాంగ్రెస్ పార్టీ ఏకగ్రీవంగా రాజ్యసభకు పంపిందని.. కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడికి మద్దతు ఇవ్వటంలో కేసీఆర్ తన అద్భుతమైన రాజకీయ చతురత చూపించారంటూ చురకలు అంటించారాయన. వైన్ అండ్ డైన్ క్రైంలో భాగస్వాములు అయిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు అభినందనలు అంటూ ఎక్స్ పోస్టు చేశారు బండి సంజయ్.

## మసాజ్ పార్లర్లపై స్పెషల్ ఫోకస్.. హైదరాబాద్ పోలీసుల కొత్త ఆపరేషన్..



**హైదరాబాద్ పెన్ పవర్:** మసాజ్ సెంటర్స్.. ఇటీవలి కాలంలో వ్యభిచారానికి అడ్డాగా మారుతున్నాయి. పైకి మసాజ్ సెంటర్, స్పా పేరిట బోర్డులు పెట్టి లోపల యథేచ్ఛగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే మసాజ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తు న్నాయి. పోలీసులు ఎప్పటికప్పుడు దాడులు చేస్తున్నప్పటికీ మసాజ్ సెంటర్ల ఆగడాలకు ఫుల్ స్టాప్ పడటం లేదు. ఈ క్రమంలో హైదరాబాద్ పోలీసులు మసాజ్ సెంటర్లపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే మస్సాజ్ సెంటర్లు, స్పాలను అంతమొందించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు కమిషనర్ కే. శ్రీనివాస రెడ్డి తెలిపారు. మసాజ్ సెంటర్ల నిర్వహణ విషయంలో ఇప్పటికే మార్గదర్శకాలు ఉన్నాయని, ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ విషయంలో ఎవరిని ఉపేక్షించమని, ఇప్పటికే అక్రమాలకు పాల్పడ్డ అధికారులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశామని అన్నారు.

## ఈ మూడు కారణాలతోనే కవితకు బెయిల్




**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు చేసింది సుప్రీంకోర్టు. బెయిల్ సందర్భంగా సుప్రీంకోర్టు కొన్ని అంశాలను ప్రస్తావించింది.

ఢిల్లీ లిక్కర్ స్కాం విచారణలో సీబీఐ ఇప్పటికే తమ తుది ఛార్జిషీట్ దాఖలు చేసింది.

ఢిల్లీ లిక్కర్ స్కాంలో కేసులో ఈడీ తన విచారణను పూర్తి చేసింది.

బెయిల్ అనేది మహిళకు సాధారణ ప్రక్రియగా అభిప్రాయపడింది సుప్రీంకోర్టు. ఆమె మాజీ ఎంపీ.. ఆమె న్యాయం నుంచి పారిపోయే అవకాశం లేదు. మహిళలకు బెయిల్ రావడమే సాధారణ పద్ధతిగా భావించి బెయిల్ మంజూ చేసింది సుప్రీంకోర్టు.

ఈ కేసులో ఈడీ, సీబీఐ విచారణ చేసింది. ఈ రెండు విచారణ సంస్థలు నమోదు చేసిన కేసుల్లో కవిత అరెస్ట్ అయ్యారు. ఇప్పుడు సీబీఐ ఛార్జిషీట్ దాఖలు చేయటం.. ఈడీ విచారణ కంప్లీట్ కావటంతో బెయిల్ ఇచ్చింది సుప్రీంకోర్టు.

## నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ని కలిసిన ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ.

**హైదరాబాద్ పెన్ పవర్:** నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై అమరావతి లో ముఖ్యమంత్రి చంద్రబాబు ని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా కేంద్ర బడ్జెట్ లో మంజూరైన మెగా టెక్స్టైల్ పార్క్, పశువులకు లైవ్ స్టాక్ వ్యాక్సిన్ తయారీ కేంద్రం, ఎమ్మిగనూరు మీదుగా కర్నూలు–మంత్రాలయం రైల్వే లైన్ ఏర్పాటు పై చర్చించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన సంబంధిత ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని కోరారు , ఆయా శాఖ మంత్రులకు తానే స్వయంగా లేఖలు రాస్తానని ఎమ్మెల్యే కు సీఎం చంద్రబాబు తెలిపారు. ఎమ్మిగనూరు లో మూడు జలవనరులు ప్రాజెక్టుల అంశంపై సీఎం తో బీవీ జయనాగేశ్వర్ రెడ్డి చర్చించారు. ఆర్డీఎస్ కుడి కాలువ, గురు రాఘవేంద్ర ప్రాజెక్టు, గాజుల దిన్నే ప్రాజెక్టులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి
విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున త్వరితగతిన ప్రాజెక్టులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కు సీఎం ఇచ్చారు.

## షాద్ నగర్ ముఖ్య కూడలిలో ఆనందం పంచుకున్న టిఆర్ఎస్ శ్రేణులు



**హైదరాబాద్ పెన్ పవర్:**సుప్రీంకోర్టులో ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో భారతదేశ అత్యున్నత న్యాయస్థానం కల్వకుంట్ల కవితకు బెయిల్ మంజూరు చేయడం పట్ల హర్షం షాద్ నగర్ బిఆర్ఎస్ శ్రేణులు. షాద్ నగర్ పట్టణంలో టపాకులు కాల్చి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఒకరికి ఒకరు మిఠాయిలు తినిపించుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. దాదాపుగా 166 రోజుల నుండి తీహార్ జైల్లో ఆధారాలు లేని కేసు విషయంలో జైలు జీవితాన్ని గడపడం జరిగిందని ఈ కేసును కేవలం కక్షపూరితంగానే ఆమెను రాజకీయంగా ఇబ్బందులకు గురిచేయాలని బిజెపి ప్రభుత్వం ఆమెపై కక్షపూరితంగా ఈ కేసును ఈడీ, సీబీఐ దర్యాప్తు సంస్థలను వాడుకొని ఆమెకు ఇబ్బందులను గురి చేయడం జరిగిందన్నారు. కానీ ఈరోజు భారతదేశ అత్యున్నత న్యాయస్థానం న్యాయబద్ధమైన తీర్పును వెలువరిస్తూ బెయిల్ మంజూరు చేయడం జరిగిందన్నారు. కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, అక్రమ కేసులు పెట్టి తెలంగాణ ఆడబిడ్డను ఇబ్బందులకు గురి చేయడం జరిగిందనీ, రాబోయే రోజుల్లో ఈ బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని పేర్కొన్నారు.

## ప్రజల సమస్యలు తెలుసునేందుకు 2 వార్డ్ కాలనీ వాసులతోముఖాముఖి కార్యక్రమం





**హైదరాబాద్ పెన్ పవర్:** షాద్ నగర్ పట్టణంలో నీ 16 వార్డు లోనీ కాలనీ వాసుల సమస్యలు తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. కాలనీ వాసులతో నేరుగా కలిసి విజ్ఞప్తులను స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే ముఖాముఖి కార్యక్రమానికి రూపకల్పన చేశారు. విడుదలవారీగా కాలనీలో పేర్కొన్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు. ఈ కార్యక్రమంలో 16, 2,18 వార్డు ప్రజలతో సమావేశమై వారి యొక్క విజ్ఞప్తులను స్వీకరించారు. డబుల్ బెడ్ కేటాయింపుల్లో పార్టీలకు అతీతంగా, పారదర్శకంగా కేటాయింపులు చేస్తానని తెలిపారు. ప్రతి పేదవాడికి డబుల్ బెడ్ లు అందేటట్టు చూస్తానని పేర్కొన్నారు. 2 వ వార్డు, 16వ వార్డు ,18 వ వార్డుల్లో ఉన్న కరెంటు సమస్యలను కూడా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, సీనియర్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, బాబర్ ఖాన్, ప్రకాష్ గౌడ్, వన్నాడ వెంకటేష్ గౌడ్, సూర్యప్రకాష్ ఖదీర్ మరియు కాలనీ వాసులు రమేష్, నాగయ్య ,కత్తి చంద్రశేఖర్ అప్ప చందు, రామ రావు, తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ గ్రామీణ వైద్యుడు బెల్లంకొండ కృష్ణ అకాల మరణం

**హైదరాబాద్ పెన్ పవర్:** హుజూర్ నగర్ పట్టణానికి చెందిన సీనియర్ ఆర్ఎంపి గ్రామీణ వైద్యుడు బెల్లంకొండ కృష్ణ తన స్వగృహంలో 27-08-2024 మంగళవారం ఉదయం అకాల మరణం చెందారు. ఆర్.ఎం.పి బెల్లంకొండ కృష్ణ భౌతికకాయంపై హుజూర్నగర్ డివిజన్ రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ మన్సూర్ అలీ ఆర్ఎంపీలతో కలిసి పూలమాలలు వేసి అశ్రు నివాళులు అర్పించినారు కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి మనోధైర్యం ప్రసాదించాలని బెల్లంకొండ కృష్ణ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. మన్సూర్ అలీ మాట్లాడుతూ అందరితో స్నేహంగా కలగొలుపుగా ఉండి అనేక సంవత్సరాలుగా అనేకమంది ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందించిన గొప్ప సేవా గుణం కలిగిన వ్యక్తి బెల్లంకొండ కృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో హుజూర్నగర్ ఆర్ఎంపి సంఘం ప్రధాన కార్యదర్శి సన్నిధి వెంకటేశ్వర్లు



కోశాధికారి ఆత్కూరి శ్రీనివాస్ పూల రాజు మదనాచారి మరియు హుజూర్నగర్ గౌడ సొసైటీ అధ్యక్షులు వల్లభు దాసు కృష్ణ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ సైదా బెల్లంకొండ గురవయ్య హుజూర్నగర్ మండలంలోని ఆర్ఎంపి పిఎంపి గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

# కుంగ్ ఫు,కరాటే విద్యలతోనే ఆడపిల్లలకు ఆత్మవిశ్వాసం







**హైదరాబాద్ పెన్ పవర్:**సమాజంలో ఆయా రంగాలలో మహిళలూ ఉన్నత రంగాలలో రాణిస్తూ దేశాన్ని ఏలే స్థాయికి చేరుకున్నారు. కానీ నేటి సమాజంలో కొందరు మహిళలూ తమను తాము రక్షించుకోలేని పరిస్థితి ఏర్పడిందని అలాంటి సమస్యకు చెక్ పెట్టేందుకు షాద్ నగర్ పట్టణ కేంద్రం లో న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ మాస్టర్ అహ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో నైపుణ్యమైనా శిక్షణ అందించేందుకు కృషి చేస్తున్నారు. కుంగ్ ఫు , కరాటే వంటి యుద్ధ కళలు ఆడపిల్లలకు సెల్ఫ్ డిఫెన్స్ ద్వారా తమను తాము రక్షించుకునే నైపుణ్యాన్ని అందిస్తాయి. విపత్కర పరిస్థితులలో ధైర్యంగా వ్యవహరించి, తమను తాము రక్షించుకోవడంలో యుద్ధ విద్యాలు కీలకంగా ఉపయోగపడతాయన్నారు. ఈ కళలు శిక్షణ తీసుకోవడం ద్వారా మానసికంగా కూడా బలపడతారు. ఒత్తిడిని తగ్గించుకోవడం, ఏకాగ్రతను పెంపొందించుకోవడం మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం,ఆడపిల్లల వ్యక్తిత్వ వికాసానికి, సమాజంలో వారి స్థాయిని పెంచడానికి కూడా దోహద పడతాయని న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ నిర్వాహకుడు అహ్మద్ ఖాన్ తెలిపారు. ప్రతి తల్లితండ్రులు తమ తమ ఆడపిల్లలను కుంగ్ ఫు నేర్పించి వారిని శక్తివంతులుగా తయారయ్యేలా చూడాలని కోరారు.

# రుణమాఫీ కానటువంటి రైతులతో ముఖాముఖి కార్యక్రమం

**హైదరాబాద్ పెన్ పవర్:**షాద్ నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు మండలం తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ దగ్గర గల రైతు వేదికలో రుణమాఫీ కానటువంటి రైతులతో ముఖాముఖి సమావేశాన్ని ఏర్పాటు చేసి వాళ్ళ సందేహాలను నివృత్తి చేసేందుకై ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,అగ్రికల్చర్ ఏడి రాజారత్నం, కొత్తూరు మండల వ్యవసాయ అధికారి గోపాల్, కొత్తూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరినాథ్ రెడ్డి ,సుదర్శన్ గౌడ్, ఫరూక్ నగర్ మండల కాంగ్రెస్



అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి ,సురేందర్,ఏనుగు జనార్ధన్ రెడ్డి, సాయిలు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ గ్రామాల రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది

# పదవులతో పనిలేదు గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనేదే నా లక్ష్యం



**హైదరాబాద్ పెన్ పవర్:**పదవులతో పనిలేదు గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనేది నా లక్ష్యం అని కాంగ్రెస్ పార్టీ మండల యువ నాయకులు ఆదూరి కిషోర్ రెడ్డి అన్నారు.
మఠంపల్లి మండల కేంద్రంలో గత రెండు నెలల నుండి గ్రామంలో ఏ ఇంట్లో చూసినా ఎవరో ఒకరు జ్యారాల బారిన పడటం జరిగింది.వైద్య సిబ్బంది గ్రామంలో కలయ తిరుగుతూ రోగాల బారిన పడిన వారిని గుర్తించి సాధ్యమైనంత మేర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ప్రతి ఇంటికి విధిగా ఏఎన్ఎం ఆశా వర్కర్లు గ్రామ ప్రజలకు ఆరోగ్య సూచనలు ఇస్తూ వైద్యాన్ని అందించడం జరిగింది. గ్రామపంచాయతీ అధికారులు గ్రామంలో మురుగు కాలువల వెంట బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షించిన ఇంకా గ్రామంలో ఎందరో విష జ్వరాలతో నానా ఇబ్బందులు పడుతుండటం అందరికీ తెలిసిన విషయమే వీటిని అన్నింటిని గమనించిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఆధురి కిషోర్ రెడ్డి తన వంతు బాధ్యతగా పదవి లేకున్నా గ్రామం మీద ఉన్న మమకారంతో ఎక్కడైతే ఎక్కువ శాతం అపరిశుభ్రతగా మురుగు కాలువలు ఉన్నాయో గుర్తించడం జరిగింది. దానిలో భాగంగానే గ్రామ ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఎన్ఎస్పి కాలువ ఎన్నో ఏళ్ల నుండి వ్యర్థాలతో నీరు నిల్వ ఉండటం వల్ల అక్కడనుండి వెళ్లే పాదచారులకు మరియు ఆ పరిసర ప్రాంత ప్రజలకు దుర్వాసన వస్తుందని గ్రామ ప్రజలు పలుమార్లు అధికారులకు తెలిపిన ఉపయోగం లేకపోవడంతో వెంటనే ఆదూరి కిషోర్ రెడ్డికి కొంతమంది అనుచరులు అతని దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి జెసిబి తో కాలువలో ఉన్నటువంటి వ్యర్థాలను తొలగించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో కిషోర్ రెడ్డి మాట్లాడుతూ పదవిలో ఉన్నా లేకున్నా గ్రామ ప్రజలు ఆరోగ్యమే నాకు ముఖ్యమని ఈ గ్రామంలో పుట్టిన వ్యక్తిగా ఇది నా బాధ్యతని అన్నారు. ఎన్ఎస్పి కాలువను శుభ్రం చేయించిన కిషోర్ రెడ్డిని గ్రామ ప్రజలు అభినందించారు

# సామాజిక సేవలో ప్రతిష్టాత్మక సేవారత్న జాతీయ అవార్డుకు ఎంపికైన నాసర్ పాషా.



**హైదరాబాద్ పెన్ పవర్:**మరెన్నో అవార్డులు సాధించాలని ఆకాంక్ష
బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో సామాజిక విభాగంలో ప్రతిష్టాత్మక సేవారత్న జాతీయ అవార్డుకు ఎంపికైన మణుగూరు కు చెందిన సామాజిక కార్యకర్త సింగరేణి కార్మిక నాయకులు ఎస్ డి నా సర్ పాషా ను మంగళవారం ప్రజా భవన్ లో పినపాక శాసనసభ్యులు గౌరవనీయులు పాయం వెంకటేశ్వర్లు శాలువాతో ఆత్మీయంగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మణుగూరు ప్రాంతంలో సింగరేణి ఉద్యోగులకు మరియు అనాథలు వృద్ధులకు గొత్తి కోయల గ్రామాల, నిర్వాసిత ప్రజల ఉపాధికి గ్రామాల అభివృద్ధికి ఎంతగానో శ్రమిస్తూ సామాజిక సేవలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన నాసర్ పాషా నీ ప్రతిష్టాత్మక సేవా రత్న జాతీయ అవార్డు ప్రకటించడం పట్ల హైదరాబాద్ కు చెందిన బహుజన సాహిత్య అకాడమీ నిర్వాహకులను ఆయన అభినందించారు మరెన్నో చక్కటి సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలని పాషాని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మెడికల్ క్యాంప్స్ నిర్వహించాలి.




**హైదరాబాద్ పెన్ పవర్:**జిల్లా కలెక్టర్ జితేష్ పి పాటిల్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులకు రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని ఆరోగ్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గురించి మెడికల్ క్యాంప్స్ నిర్వహించాలని, పట్టణ ప్రాంతాల్లో, గ్రామాల్లో,ఎక్కువ జ్వరాలు ఉన్నాయో గుర్తించి రోగులను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి సమయంలో వైద్యం అందించాలన్నారు. బరువు తక్కువ పిల్లల్ని గుర్తించి (శ్యామ్ , మాన్) పోషక విలువలను అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రాథమిక , మాతాశిశు ఆరోగ్య కేంద్రాల్లో సీజేరియన్ అపరేషన్లను తగ్గించాలని, సాధారణ కాన్పుల శాతాన్ని పెంచాలని, తెలియజేశారు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఏదైనా సమస్యలు వస్తే వారి దృష్టికి తీసుకురావాలని, స్కూల్స్ లో 6 మెడికల్ ప్లాంట్స్ నాటాలని, పిల్లలకు ట్రెడేషన్ మందుల గూర్చి అవగాహన కల్పించాలని, టీ హబ్ పరీక్షా కేంద్రం లో ఇన్ టైం లో రిజల్ట్స్ రావాలని ,టీ హబ్ వారు రూట్ మ్యాప్ తయారు చేసి మెడికల్ ఆఫీసర్ కి ఇవ్వాలని ,ఎన్సిడి స్క్రీనింగ్ 100% చేయాలి అని గర్భవతుల నమోదు 100% అవ్వడానికి అర్బన్ లో ఆర్ పి, మహిళా సమాఖ్య , మెప్మా, ఏపిఎం ,ఆర్ పి ఎస్ ,తో సమన్వయ మీటింగ్ నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ బాలాజీ, డాక్టర్ మధువరన్, డాక్టర్ రాకేష్, డాక్టర్ స్పందన ,డాక్టర్ కళ్యాణ్, మరియు జిల్లాలోని వైద్యాధికారులు పాల్గొన్నారు.

# త్రివేణి పాఠశాలలో మదర్ తెరిసా జయంతి సందర్భంగా ఛారిటీ కార్యక్రమాలు.

**హైదరాబాద్ పెన్ పవర్:** మిషనరీస్ ఆఫ్ చారిటీస్ స్థాపించి దీనులకు సేవ చేసిన భారతరత్న మదర్ తెరిసా జయంతి త్రివేణి పాఠశాలలో జరిగాయి ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు తాము తెచ్చిన పళ్ళు , బ్రెడ్ మొదలైన వాటన్నిటిని ఒకచోట చేర్చి ఖమ్మం నగరంలో గల వివిధ అనాధ శరణాలయాలకు వృద్ధాశ్రమాలకు పంపించడం జరిగింది. ఇక్కడ విద్యార్థుల ద్వారా సేకరించబడిన పండ్లు ఇతర ఆహార పదార్థాలను వృద్ధులకు పంపిణీ చేశారు. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ చెప్పే మాటలు కంటే చేసే పనుల వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుందని సాయం చేయాలనేటువంటి మాటలతో కాక చేతలలో దానిని చూపించాలని విద్యార్థులు మానవ సేవను అలవాటు చేసుకున్నట్లయితే అది మాధవ సేవ అని అన్నారు. ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు సేవా గుణాన్ని కలిగి ఉండాలని దీనుల పట్ల జాలి దయ కలిగి ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి విద్యా సంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వర్ రావు పాఠశాల సిఆర్ఓ మురళీకృష్ణ వైస్ ప్రిన్సిపల్ స్వప్న ముస్తఫా అశోక్ క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ సందీప్ మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


# రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కి స్వాగతం పలికిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్ర ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని మంగళవారం ఉదయం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దర్శించుకున్నారు.యదగిరిగుట్ట కు మొదటిసారిగా వచ్చిన గవర్నర్ గారిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గారు ఘనంగా స్వాగతం పలికారు.మొదటగా పుష్కరిణి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవవర్మ నారసింహుడికి,ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య గారు ప్రత్యేక పూజలు చేశారు.తర్వాత గవర్నర్ ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించగా,అధికారులు స్వామివారి శేష వస్త్రాలు,తీర్థ ప్రసాదాలను అందచేశారు.

# లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం మట్టపల్లి మహా క్షేత్రం నందు 27.08.2024న శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినము సందర్భంగా దేవస్థానం నందు శ్రీకృష్ణ పరమాత్ముడికి ఉదయం 8 గంటలకు దేవాలయ అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, మార్తి లక్ష్మీనరసింహమూర్తి వారలచే పంచసూక్త విధానముగా పంచామృత అభిషేకములు, అర్చనలు జరిగినవి. అనంతరం మధ్యాహ్నం 12.00 లకు శ్రీ స్వామివారికి నివేదనలు, భక్తులకు తీర్థ ప్రసాదములు వినియోగము జరిగినవి. సాయంత్రం 6 గంటలకు శ్రీకృష్ణ పరమాత్ముడికి విశేష ఆరాధనలు, శ్రీకృష్ణ జన్మ వృత్తాంత ప్రవచనములు జరిగినవి. తదుపరి 7.00 గంటలకు తొమ్మిది రకముల ప్రసాదములు ( హోరలు ) స్వామివారికి నివేదనలు, భక్తులకు తీర్థ ప్రసాదం వినియోగం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో
దేవస్థాన అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు, చెన్నూరు విజయ్ కుమార్, కార్యనిర్వహణాధికారి సిరికొండ నవీన్, దేవస్థాన అర్చకులు సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

# వర్షాకాలం: లవర్స్ ఫెస్టివల్.. ప్రేమికుల జాతర ఎక్కడ జరుగుతుందో తెలుసా...



**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రేమికుల జాతర గురించి ఎప్పుడైనా విన్నారా? ఈ అరుదైన జాతర ప్రతి ఏటా వర్షాకాలంలో జరుగుతుంది. రెండు రోజుల పాటు ఈ జాతరను అమర ప్రేమికులైన లైలామజ్ను లవర్స్?సమాధుల దగ్గర నిర్వహించే ఈ జాతరకు సుదూర ప్రాంతాల నుంచి ప్రేమికులు తరలివస్తారు.

లైలా.. మజ్ను అమర ప్రేమికులు అని అందరికీ తెలుసు. ఆ ప్రేమ కథ మీద ఎన్నో సినిమాలు వచ్చాయి. అంతేకాదు. ఎవరైనా గాఢంగా ప్రేమించుకుంటే వాళ్లను లైలా మజ్నులతో పోలుస్తాం. కానీ,, వాళ్లస్టోరీ నిజమా? లేక కల్పితమా? అనేది చాలామందికి తెలియదు. అయితే ఆ ప్రేమ కథ వాస్తవమే అనేందుకు వాళ్ల సమాధులు సాక్ష్యాలుగా నిలిచాయి. కానీ, వాళ్ల ప్రేమ కథ మాత్రం అనేక రకాలుగా ఇప్పటికీ ప్రచారంలో ఉంటోంది.

లైలా, మజ్నులు చనిపోయినా.. వాళ్ల ప్రేమ ఇప్పటికీ సజీవంగానే ఉంది. ఆ ప్రేమ జ్ఞాపకంగా వాళ్ల సమాధులు రాజస్థాన్లోని శ్రీగంగానగర్ జిల్లాలోని బింజోర్ అనే ఒక చిన్న గ్రామంలో ఉన్నాయి. ఈ ఊరు పాకిస్థాన్ సరిహద్దు నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. కార్గిల్ యుద్ధం జరగకముందు పాకిస్తానీలు కూడా ఇక్కడికి సమాధుల సందర్శన కోసం వచ్చేవాళ్లు. కానీ కార్గిల్ తర్వాత అనుమతి ఇవ్వడంలేదు. ప్రతి రోజూ చాలామంది ప్రేమికులు అక్కడికి వెళ్లి వాళ్ల లవ్ సక్సెస్ కావాలని పూజలు చేస్తారు.

ప్రతి సంవత్సరం వర్షాకాలంలో 'ప్రేమికుల 'జాతర' కూడా జరుపుతారు. ఆ టైంలో దేశం నలుమూలల నుంచి వేల సంఖ్యలో ప్రేమ జంటలు వచ్చి లైలా మజ్నుల సమాధుల్ని దర్శించుకుంటాయి. విశేషం ఏంటంటే.. అన్ని మతాల వాళ్లకు ఇక్కడ అనుమతి ఉంది.

**లైలా మజ్నుల ప్రేమ కథ**

మజ్ను అసలు పేరు కైసిన్ అల్ ముల్లా. కైసిన్ పుట్టిన తర్వాత అతని తండ్రి షా అమారి ఓ జ్యోతిష్కుడి దగ్గరికి తీసుకెళ్లాడు. అప్పుడు జ్యోతిష్కుడు 'నీ కొడుకు ప్రేమ కోసమే పుట్టాడు' అని చెప్పాడు. కానీ.. అమారికి అది ఇష్టం లేదు. అందుకే ప్రతిరోజు తన కొడుకు ప్రేమ జోలికి వెళ్లకూడదని దేవుడిని ప్రార్థించేవాడు. కానీ, మజ్ను ఒకసారి మసీదులో లైలాను చూసి ప్రేమిస్తాడు. ఆమె తండ్రి నాజత్ షా బాగా ధనవంతుడు. బాగా డబ్బున్న ఇంటికి తన కూతురిని కోడలుగా పంపాలనుకునేవాడు. లైలాను చూసినప్పటినుంచి మజ్నుకు ఎప్పుడూ... ఆమె ఆలోచనలే ఉండేవి. కొన్నాళ్ల పాటు ఆమె ఎక్కడికి వెళ్లినా ఫాలో అయ్యాడు. అది గమనించిన లైలా కూడా మజ్ను ప్రేమలో పడిపోయింది. విషయం తెలుసుకున్న లైలా తల్లిదండ్రులు ఆమెను ఇంట్లో నిర్బంధించారు.

లైలా కనిపించకపోవడంతో మజ్ను మానసిక క్షోభతో అనారోగ్యం పాలయ్యాడు. అదే టైంలో లైలాను భగత్ అనే వ్యక్తికిచ్చి పెళ్లి చేశారు. అయినా లైలా మనసు మారలేదు. ఎప్పుడూ మజ్నునే తలుచుకుంటూ బాధపడేది. లైలా ప్రేమ విషయం తెలుసుకున్న భగత్.. ఆమెను మజ్ను వద్దకు పంపించేశాడు. అలా లైలా, మజ్నులు మళ్లీ ఒకటయ్యారు.

కానీ.. అది చూసి సహించలేని పెద్దలు లైలాను ఇంటికి తీసుకెళ్లి బంధించారు. ఆ బాధ భరించలేని లైలా ప్రాణాలు విడిచింది. ఈ వార్త విన్న మజ్ను కూడా వెంటనే గుండె పగిలి చనిపోయాడు. ఆ తర్వాతే పెద్దల కళ్లు తెరుచుకున్నాయి. అందుకే లైలా మజ్నుల సమాధులు ఒకే చోట కట్టించారు. అయితే లైలా మజ్ను అరబ్ దేశానికి చెందిన జంట అనే కథ ప్రచారంలో ఉంది. ఏది ఏమైనా సమాధితో ప్రేమకు సజీవ సాక్ష్యంగా నిలిచిన ఈ జంట.. అమర ప్రేమికుల జాబితాలో చోటు సంపాదించుకుంది.

# గిరిజన రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు.



**హైదరాబాద్ పెన్ పవర్:**గిరిజన రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందడమే కాక ప్రభుత్వం కల్పిస్తున్న చిన్న తరహా పరిశ్రమలలో చేపల పెంపకంతో జీవనాధారం పెంపొందించుకొని పదిమందికి ఉపాధి కల్పించడం సంతోషకరమని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. మంగళవారం మణుగూరు మండలంలోని సాంబయిగూడెం గ్రామంలో ట్రైబల్ ఫిషరీస్ కోపరేటివ్ సొసైటీ ద్వారా చేపల పెంపకంతో జీవనాధారం పొందుతున్న గిరిజన రైతుల చేపల చెరువును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమల ద్వారా వారి గ్రామంలోని చెరువులోని చేపలు పట్టి వాటిని అమ్ముకొని వారి కుటుంబాలను పోషించు కుంటున్నారని అన్నారు. ఎమ్మెస్ ఎం ఇ యూనిటీ కాస్టు 24 లక్షలని, 14 లక్షలు సబ్సిడీ లభించిందని, రెండు లక్షల 50 వేలు సొసైటీ సభ్యులు కంట్రి బ్యూషన్ చేయగా, మిగతా సొమ్ము బ్యాంకు ద్వారా రుణం తీసుకొని ఈ చెరువులో చేపల పెంపకం చేపట్టారని అన్నారు. 60 మంది గిరిజన రైతులు సొసైటీగా ఏర్పడి చేపలు పట్టి మార్కెటింగ్ చేసుకోవడానికి టీవీఎస్ వాహనాలు మరియు లైఫ్ జాకెట్లు, వలలు, తెప్పలు, మినీ వ్యాన్ లాంటివి కొనుగోలు చేసుకుని వారే సొంతంగా మార్కెటింగ్ చేసుకొని ఖర్చులు పోను వచ్చిన లాభాన్ని అందరూ కలిసి పంచుకోవడం ఆనందించదగ్గ విషయమని అన్నారు. ప్రస్తుతం గిరిజన రైతుల పంట పొలాలు గోదావరి ముంపునకు గురి అవుతున్నాయని గోదావరి తగ్గగానే ఆ పంట పొలాలలో మిర్చి, పత్తి వేసి పంటలు పండించుకుం టామని గిరిజన రైతులు తెలిపారు. అలాగే చేపలు అమ్ముకోవడానికి బి టి పి ఎస్ దగ్గర మార్కెట్ సౌకర్యం కల్పించాలని, చిన్న చేప పిల్లలు పెంపకానికి చిన్న కుంటలు లాంటివి ఏర్పాటు చేసుకోవడానికి ఆర్థిక సహాయం అందించాలని వారు పిఓకి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జియస్ఓ భాస్కర్, ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, డీఎస్ఓ ప్రభాకర్ రావు, రామ్ కుమార్, సొసైటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు మరియు గిరిజన రైతులు పాల్గొన్నారు.